# తానూ మనిషేనా?

శ్రీ జి. వి. యల్. నరసింహా రావు

రామం తల్లీ, తండ్రీ అతని చిన్నతనంలోనే చనిపోయినా మేనమామ ప్రకాశరావుగారు ఆస్థిపరులుకావడం, అందులోనూ ఆయనకు పిల్లలు లేకపోవడం— ఈ రెండు కారణాలూ రామానికి 'అనాథ'త్వాన్ని అంట గట్టలేకపోయినై. సరస్వతమ్మగారు రామాన్ని కన్నబిడ్డలా ఆదరించి అతనికి తల్లిలేని లోటు తీర్చింది. ప్రకాశరావుగారు సరేసరి! ఏక్షణంలో ఏది కోరితే దానిని క్షణాలలో సమకూరుస్తూ అల్లారు ముద్దుగా చూచుకుంటున్నారు. అందుకనే ఇరవై ఏళ్ళు వచ్చినా రామానికి తల్లీ తండ్రీ లేని లోటే కన్పించలేదు.

బి. ఏ. పరీక్ష వ్రాసిన రామానికి వెంటనే ఉద్యోగం కోసం అప్లికేషన్లు పెట్టాల్సిన అవసరం లేకపోయిందంటే అందుకు కారణం ప్రకాశరావుగారి ఆస్థిమాత్రమేనని చెప్పాలి. రామం ఉద్యోగం చెయ్యాలని ఉబలాటపడ్డా, ప్రకాశరావుగారు అనుభవజ్ఞులు కాబట్టి ఉద్యోగం చెయ్యడంలో ఉన్న సాధకబాధకాలను వివరించి "అధికారుల మెడలువంచి అస్వతంత్రపు బ్రతుకు బ్రదికేకన్నా తనకున్న ఈ ఆస్తులను అజమాయిషీ చేసుకుంటూండ"మని సెలవిచ్చారు. ఆలోచించినమీదట రామానికికూడా మామగారి సలహా సబబుగానే తోచింది. ఇష్టపడ్డాడు కూడాను.

కాని అసలు వచ్చిన చిక్కల్లా తన పెండ్లి ప్రయత్నాలదగ్గరే! ప్రకాశరావుగారికి మరో తమ్ముడుకూడా ఉన్నాడు. ఆయనకు ఒక్కతే కూతురు శ్యామల. శ్యామలను రామానికిచ్చి వివాహంచేస్తే- తమకిద్దరకూ పురుషసంతానం లేదుగాబట్టి ఆస్తులు పరాయత్తంగాకుండా లక్షణంగా ఉంటుందిగదా అని ఆలోచించి ప్రకాశరావుగారు మూడేళ్ళక్రితమే తమ్ముడు సుబ్బారావును పిలిచి తన నిర్ణయం తెలియజేశాడు. తమ్ముడు కూడా ఆ సూచనను సహర్షంగా ఆమోదించాడు. ఈ విషయం మరో చెవిని పడకపోయినా 'శ్యామల రామూ భార్య' అని అందరూ రూఢిపరచుకున్నారు. అయితే శ్యామల తన భార్య కావడం గురించి రామం ఎప్పుడూ ఆలోచించనేలేదు.

రామం తెలివిగలవాడే అయినా అతనిలో దీక్ష, దృఢత్వం, ఆశయాలు, ఆచరణ- యివన్నీ పూజ్యం, చిన్నప్పటినుండీ మామయ్య అతనిని పెంచిన తీరునుబట్టి అతనికి సోమరితనం, భోగలాలసత్వం బాగా పట్టుబడిపోయాయి. సుకుమారమైన అతని శరీరంలాగే హృదయంకూడా అతి మెత్తనిది. అందుకనే అతనిలో పట్టుదల, సాహసం పూజ్యం!

రామానికి ఎలాగయినా ఈ లగ్నాల్లో వివాహం చేసెయ్యాలని ప్రకాశరావుగారు ప్రయత్నిస్తున్నారు. జోరుగా సన్నాహాలు సాగించడం ప్రారంభించారు. రామం గూడా ఈ విషయాలను గమనిస్తున్నాడు. అతనెప్పుడూ శ్యామలను వివాహమాడాలని అనుకోలేదు. అతని దృష్టి వేరుగా ఉంది. అందుకనే పచ్చివెలక్కాయ గొంతును పట్టేసినట్టు బాధపడుతున్నాడు రామం. అటు ప్రకాశరావుగారికీ సాహసించి చెప్పలేడు. అట్లని యిటు కమలకూ ద్రోహం చెయ్యలేడు. ఈ సంధిలో బడి కొట్టుమిట్టాడుతున్నాడు రామం.

ఒక మధ్యాహ్నం ప్రకాశరావుగారు వచ్చి రామం దగ్గిరే మరో కుర్చీలో కూర్చున్నారు. రామం పుస్తకం మూసి తలెత్తి చూశాడు. ప్రకాశరావుగారు తనదగ్గరకు వచ్చి కూర్చున్నారంటే ఏదో విశేషమున్నదన్నమాటే! రామం ఆశ్చర్యంగా మామయ్య ముఖంలోకి చూశాడు.

"రామం, చూడు... కాస్త పట్నం వెళ్ళి ఈ శుభలేఖలు నీకు నచ్చిన విధంగా అచ్చేయించుకురా నాయనా— నేనొక్కణ్ణే ఎన్నిపనులని చూసుకుంటాను?" ప్రకాశరావుగారు కుతూహలంగా చెప్పారు. కాని రామం ముఖం వివర్ణమయింది. కనుబొమలు ముడతలుపడినై. భారంగా నిట్టూర్చి అన్నాడు. "ఎందుకు మామయ్యా?" ప్రకాశ

రావుగారు విస్మయంగా అడిగారు "ఎందుకేమిటి రామం, నీ వివాహం కోసం".

రామం తన మనస్సులో ఉన్నదంతా చెప్పెయ్యాలనుకున్నాడు. అవును. తన అభిప్రాయం చెప్పడానికింతకన్న మంచి సమయం దొరకదు. కాని చెప్పలేకపోయాడు. "నేనిప్పుడు పెండ్లి చేసుకోను!" క్లుప్తంగా మట్టుకు అనేసి ఊరుకున్నాడు.

"ఏమిటీ, చేసుకోవు ?.... యింత ప్రయత్నము జరిగాకనా ?...." ప్రకాశరావుగారు ఆతురతతోను, ఆశ్చర్యంతోనూ గట్టిగా అన్నారు.

రామం గుండె వేగంగా కొట్టుకుంటూంది, రక్తం గబగబ పరుగెత్తుతోంది. "చేసుకోను"— భయంగా వంచినతల ఎత్తకుండానే అన్నాడు.

"మరేం చేస్తావ్" ప్రకాశంగారు నిష్ఠూరంగా అన్నారు. "నాకీ సంబంధం యిష్టంలేదు"—— రామంఎంత తాపీగా అనాలనుకున్నా కంఠం వణుకుతూనేవచ్చింది.

ఏమిటీ ?....ఏమిటీ ? ఈ సంబంధమే యిష్టంలేదూ?" ప్రకాశంగారు ఖంగారు, క్రోధము. విస్మయమూ పెనగొనగా గబ గబా అనేశారు కుర్చీలో నుండి ఆతురతగా లేస్తూ "ఇదే నీ నిశ్చయమా ?" పళ్ళు పటపట లాడకపోయినా కోపంతోనే అన్నారు. రామం వణికిపోయాడు. మాట్లాడకుండానే ఊరుకున్నాడు. మాట్లాడితే మీదబడి తినేస్తాడేమో అన్నట్లుందాతని స్థితి.

"హుఁ ... సరే ఆలోచించు!" క్షణంసేపు రామం వంకచూసి ఇలా అనేసి వెళ్ళిపోయారు ప్రకాశరావుగారు. రామం అలాగే ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఒక గంట తర్వాత సరస్వతమ్మగారు వచ్చింది. ఎన్నో విధాల ఆమె బతిమాలి చెప్పింది. రామం దేనికీ సమాధానం ఇవ్వలేదు. సరస్వతమ్మగారే రామం తల నిమురుతూ చెప్పింది శ్యామల తెచ్చే ఆస్థి, తామిచ్చే ఆస్థి యింకేంకావాలి ? ఎంత సుఖంగా జీవించవచ్చు ? కళ్ళవెంట నీళ్ళుపెట్టుకుని బతిమిలాడింది. చివరిమాటగా ప్రకాశరావుగారు చెప్పమన్నారని ఒకమాట గూడా చెప్పింది. "శ్యామలను పెండ్లిచేసుకునే వాడికే తమ ఆస్థి దఖలు పడుతుందట",

కీలెరిగి వాత పెట్టినట్లయింది రామానికి. అతనికి బలహీనత ఎక్కడుందో అక్కడే....సరిగా అక్కడే ఈ మర్మఘాతం తగిలింది. యాపాయి లేనిదే తాను దమ్మిడీకి మారనని అతనికి తెలుసు. దబ్బులేకుండా తను బ్రతుకలేడు. అంటే ప్రకాశరావుగారి ఆస్థిలేకపోతే తాను బ్రదకలేడు. అంతేగాకుండా అత్తనూ మామనూ తిరస్కరించి వారితో సంబంధాలు వదులుకోలేడు. ప్రకాశరావుగారు ఆషా మాషీగా మాట్లాడే వ్యక్తిగాదనీ, వ్యవహారంలో ఖచ్చితమైనవాడనీ అవసరమయితే తన యావదాస్తినీ 'వినోబా భావేగారి ఏదో దాన యజ్ఞానికి వ్రాసి యిచ్చేయగలడనీ' రామానికి బాగా తెల్సు. అందుకనే ఎట్టకేలకు రామం లొంగిపొయ్యేడు. మామగారికి 'జో హుకుం' చెప్పాడు, వివాహం సలక్షణంగా జరిగిపోయింది. రామం తన మిత్రులెవరినీ ఆహ్వానించలేదు. అతనికి కమల విషయం హృదయాన్ని కోసివేస్తోంది.

• • •

కమల దగ్గరనుండి రోజూ ఉత్తరాలు వస్తున్నాయి. రామం జవాబివ్వకపోవడంతో ఆ ఉత్తరాల ఉరవడి మరింత హెచ్చింది. ఈ ఉత్తరాలను జూచి రామం కంపించిపోతున్నాడు. అతన్ని కవ్వించినట్టు పోస్టుమాన్ రోజూ ఉత్తరాలు తెచ్చి అందిస్తూనే ఉన్నాడు.

కమల రామానికి క్లాసుమేటు. ఇంటరుమీడియటు దగ్గరనుండీ బి.ఏ. వరకూ ఏకంగా నాలుగేళ్ళు కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఇంటర్‌మీడియట్‌లోనే హృదయాలు మాట్లాడుకున్నా. డిగ్రీ క్లాసులోనే ఉత్తరాలు సంభాషణలు నడిచాయి. వారిద్దరూ "ప్రేయసీ ప్రియులని" కాలేజీ ఏకంగా వారికొక సర్టిఫికెట్టుగూడా ప్రసాదించింది. చివరి రోజుల్లో వారి ప్రణయం విచ్చల విడిగా నడిచింది. పట్నంలోవారి గ్రామాలకు చెందిన విద్యార్థులెవరూ లేరుగాబట్టి వారి ప్రణయం పెద్దవారి నోటీసుల పాలుగాకుండా తప్పించుకుంది.

బి. ఏ. పరీక్షలు వ్రాశారు. ఆమరునాడు ఎవరి యిళ్ళకు వారు వెళ్ళిపోతారు. రామం, కమలం యిద్దరూ ఆరోజు సినీమాకు వెళ్ళారు, బాక్సు తీసుకున్నారు. సినిమా చూస్తున్నారు. కాని వారి అనుభూతులు వేరుగా ఉన్నాయి. అంతవరకూ వారు దూర దూరంగా ఉంటూ వచ్చారు. ఈరోజు వారికా అడ్డులేమీలేవు. సినీమా పూర్తిగాకముందే వాళ్ళు బయటికి వచ్చేశారు. రామం కమలాన్ని సరాసరి తన రూముకే తీసుకుపోయాడు.



మణిపురి పురోభి వృద్ధికై తోడ్పడే మణిపురి మహిళ చేనేత మగ్గముపై నేత నేయుట.

కమలం చిక్కులో పడ్డట్టు తెలుసుకుంది. దానితో కమలానికి మతిపోయినట్లయింది. రోజూ రామానికి ఉత్తరాలు గుప్పించి వేస్తోంది. అంతవరకూ ఉత్తరాలు వ్రాస్తున్న రామం — ఈ పాపానికి మూలపురుషుడై యుండీకూడా ఉత్తరాలు వ్రాయడం మానుకున్నాడు. రామం సంగతి తెల్సుకుని బాధపడుతున్నాడు. ఏదో పాపం చేసినవాడిలా హృదయం దహించివేస్తోంటే అతనిలో ఉత్సాహం హరించిపోయింది.

ఆరోజు వెంటనే బయలుదేరి రమ్మనమనీ, కనీసం ఉత్తరం వ్రాయమనీ, లేకపోతే తానే బయలుదేరి వస్తున్నాననీ కమల తీవ్రంగా వ్రాసింది. ఆవుత్తరం చదివిన రామం గుండె ఆగిపోయినంత పనయింది. కమల యిక్కడకువస్తే జరిగే రభస ఎలాంటిదో ఊహించుకున్నాడు. చివరకు కలం, కాగితం తీసుకుని బహునెమ్మదిగా వ్రాశాడు.

"కమలా,

చేయరాని పాపం చేశాం. ఫలితం వెంటనే సిద్ధమయింది. ఇందులోమనయిద్దరమూ సమభాగస్థులమే!... చేసిన తప్పు సరిదిద్దుకునేందుకు బదులు నేను మరోతప్పు చేశాను. ఇంకొక స్త్రీని వివాహమాడాను!!

ఇప్పుడు నేను వివాహితుడను. నీవు బయలుదేరి రావద్దు. నేనే ఏదో ఒకటి ఆలోచించి తెలియజేస్తాను.

....నావంతు పాపానికి క్షమిస్తావుగదూ!!!

నీ—రామం"

ఉత్తరం కవరులోపెట్టి వెంటనే పోస్టు చేయించాడు కూడాను.

వ్రాయడమయితే వ్రాశాడుకాని దీనిఫలితం ఎలా ఉంటుందో అని గుండె చేత్తోపట్టుకు ఎదురు చూస్తున్నాడు. అయిదోరోజున ఉత్తరం వచ్చింది. అందులో కమల నిష్ఠూరంగా వ్రాసింది—

"ప్రియుడా,

నీ నిర్ణయం నా జీవితాన్ని నలిపివేశింది. మొద్దుబారిన హృదయం నీది; మోడువారిన జీవితం నాది.... గుబాళించే కుసుమాన్ని, కోమలమయిన కమలాన్ని — నీ కర్కశహస్తాలతో నలిపివేశావ్! కాలిక్రింద.... నిర్దయగా త్రొక్కిపోయావ్!!

...జీవితాలతో నిర్లక్ష్యంగా ఆటలాడే నీకు క్షమ ఎక్కడిది?

మరియొకమాట: కోర్టులో నీపై అభియోగముతెచ్చి నెగ్గలేకపోను. మనం దిగినఫొటోలు, నీవు వ్రాసిన ఉత్తరాలు నాకు మంచి సాక్ష్యాలు.

....కాని,....నూతన వధువుకోసం నిన్ను వదిలే

స్తున్నాను. అడవిలో మొద్దులా, లోయలో శిలలా — చిరకాలం బ్రతుకు. మరి సెలవ్ ...!

యిట్లు,
తుదినమస్కారములతో,
జీవితంలో—ఓటమి—తిన్న,
'కమలం' "

మాటల్లోనిగూఢత్వాన్ని, కదలికమబట్టి మన స్తత్వాన్ని, గ్రహించడం చేతగాని రామానికి ఈ ఉత్తరం చూశాక మనస్సు సంతోషంతో కదిలింది. తనపైనుండి ఏదో, పెద్దభారం దిగిపోయినట్టు తేలికపడ్డాడు రామం. కమల పెద్ద రభస చెయ్యకుండా, మరోదారి చూసుకొనడానికి సిద్ధపడడం రామానికి చాలా సంతోషం కల్గించింది. ఆధారాలున్నా అభియోగం తేనందుకామె ఔదార్యాన్ని మనస్సులోనే అభినందించుకున్నాడు. ఆరోజు సంతోషంగా గడిపాడు రామం — శ్యామల ముఖం వికసించింది.

ఆమరునాడే పరీక్షఫలితాలు వచ్చేశాయి. రామం ఆత్రుతతో నంబర్లు దొర్లించేస్తున్నాడు. తనకెలాగూ 'క్లాస్' వస్తుందని నమ్మకంలేదు. అందుకని సెకండు క్లాస్‌లోనే తన నంబర్లకోసకం వెదుక్కుంటున్నాడు. తన నెంబ రెక్కడా కన్పించనేలేదు. గుండె వేగం హెచ్చి, చేయి వణకిపోతుంటే పేపరు కదిలిపోతోంది. అంకెలన్నీ అలముకుపోతోన్నై. సబ్జక్టు పేర్లే కన్పించడంలేదు. ఈస్థితిలో థర్డ్‌క్లాస్‌లో గాలాంవేశాడు. అచటఉన్న అసంఖ్యాకమయిన నంబర్లను చీరుకుపోతున్నాడు. ఎలాగైతేనేం, తన నంబర్ను పట్టేశాడు. తాను పాసయాడు. థర్డ్‌క్లాస్‌లో పాసయాడు. చాలదూ ? అందోళన యింకా తగ్గలేదు. హృదయం మధురంగా, నిండుగా ఊగుతోంది. అప్పుడు కమలం విషయం గుర్తు వచ్చింది. ఆమెకోసం చూశాడు. ఫస్ట్‌క్లాస్ రాలేదు. కాని సెకండుక్లాసు వచ్చింది. — "అవును తనకంటే కమలం అన్నింట్లోనూ మిన్నే ! తనకంటే గొప్పగా సెకండ్‌క్లాస్ సంపాదించింది. — మరొకప్పుడైతే కమలం సాధించిన ఈవిజయానికి అమాంతం లేచి డాన్సు ప్రారంభించేవాడే ... కాని, ఏం లాభం. ఇవాళ కమలానికి, తనకూ ఉన్న సంబంధం డొల్లబోయింది. అబ్బ, ఆరోజులెంత మధురంగా ఉండేవి ?...." — యిలాగే ఏవేవో మధురమయిన తలపులతో తనకు తెలియకుండానే, పిచ్చిగా పేపరంతా కలయజూస్తున్నాడు. నంబర్లన్నీ అయిపోయాయి, క్రింది భాగంలోఉన్న ఒక వార్త "20 ఏళ్ళ యువతి ఆత్మహత్య" అన్న వార్త రామాన్ని ఆకర్షించింది. ఎందుకనో హృదయం తొందరపడుతోంటే గబ, గబా చదివాడు. — "పట్నంలో బి.ఎ., స్టూడెంటు 'కమల' అనే 20 ఏళ్ళ యువతి మొన్న ఉదయం విషం తిని హాస్పిటల్‌లో చేర్చిన కొద్దిసేపటికి మరణించింది. ఆమె వ్రాసియుంచిన లేఖలో తన ప్రియుడు మోసగించాడనీ, గర్భిణీ వచ్చినదనీ, తలిదండ్రులకు ముఖం చూపలేక మరణిస్తున్నాననీ. — తన చావుకెవరూ బాధ్యులు కారనీ వ్రాసినట్లు తెలుస్తోంది" — రామం ఒక్క పొలికేకవేసి పిచ్చివాడిలా హాలులోకి పరుగెత్తాడు. అక్కడేదో తగిలి తల్లక్రిందులుగా పడిపొయ్యాడు. రామానికి దెబ్బ తగిలి స్పృహ తప్పింది. రామం మెదడు దెబ్బతింది. సాయంత్రానికల్లా జ్వరం ముంచుకొచ్చేసింది. రాత్రల్లా జ్వరం తగ్గలేదు. రామం ఒకటే పలవరింతలు "కమలా....కమలా, ఇదిగో నేనూ వస్తున్నా ! తీసుకెళ్ళవూ ? కమలా, ఓడిపోయింది నీవుకాదు. నేనే ! ముమ్మాటికీ నేనే ఓడిపోయాను కమలా !. ఒక్కసారి గాదు — అనేకసార్లు ఓడిపోయాను....నీవు ఒక్కసారి ఓడి చనిపొయ్యావు, నేను ఇన్నిసార్లూ ఓడి చావలేకున్నాను....కమలా....కమలా నాది పిరికి గుండె ! నీదే. ఫస్టుమార్కు నీదే కమలా....నేను ఫెయిలయ్యాను ; ఇదిగో కమలా....బాబోయ్, చంపెయ్యబోకు, నన్ను పీక్కుతినకు నీపుణ్యముంటుంది ? కమలా, కమలా.... రక్షించవూ ? నన్ను క్షమించవూ ?" ఇలా ఇల్లంతా లేచిపోయేటట్లు పెడబొబ్బలు పెడుతున్నాడు. అమాంతం మంచంమీదనుండి లేచి పరుగెత్తబోతున్నాడు. తెల్లవారుఝామున నేటివ్ డాక్టరు వచ్చిచూచాడు. "సంధించింది" అన్నాడు ముఖం త్రిప్పుకుంటూ. అంతవరకూ కన్నీటితో రెప్పవేయకుండా సేవజేస్తోన్న శ్యామల, గుండెబేజారై ఏడుస్తూ కూర్చున్న సరస్వతమ్మగారూ ఒక్కసారిగా గొల్లుమన్నారు. రామం ఉత్తరాలను, డైరీని తనిఖీజేసి అప్పుడే ఆగదిలో అడుగుబెటిన ప్రకాశరావుగారు విచారంగా అన్నారు. "రామంకోసం కమల బలిఅయిపోయింది. ఆరామంకోసమే శ్యామల కన్నీరుకారుస్తోంద. తనకోసం ఆశించిన ఈ యిద్దరికోసమే రామం ఈ స్థితికి వచ్చాడు !....తనకోసము, తన సౌఖ్యంకోసము లోభించిన రామం కమల ప్రాణాలను బలికొన్నాడు. శ్యామలకు తీరని వ్యధకల్పించాడు"— ఆధ్వనిలో ఈమాటలు ఎవరికీ వినిపించలేదు. అయినా ఈమాటలనే పదేపదే గొణుక్కుంటూ తలవంచుకు కూర్చున్నాడు ప్రకాశరావు.

---